క్లుప్తంగా

సీఎం జగన్‌తోనే రాష్ట్ర అభ్యున్నతి

పెనుగొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేద ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభ్యున్నతి జరుగుతుందని పెనుమంచిలి సర్పంచ్ గణేశుల శేషవేణి అన్నారు. శుక్రవారం ఆచంట మండలం పెనుమంచిలిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం పరిధిలో డిజిటల్ బోర్డు ఆవిష్కరణ అనంతరం వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటా తిరిగి బ్రోచర్లు అందించారు. కార్యక్రమంలో మండల కన్వీనరు జక్కంశెట్టి చంటి, ఉప సర్పంచ్ గంటి బాబూరావు, గ్రామ అధ్యక్షుడు నక్క ప్రేమ్ కుమార్, విద్యా కమిటీ చైర్మన్ పుచ్చకాయల బీమారావు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు కార్తీకమాస పూజలు

నరసాపురం రూరల్: మండలంలోని సారవ గ్రామంలో ఉన్న ముత్యాలమ్మ అమ్మవారికి కార్తీక మాస తొలి శుక్రవారాన్ని పురస్కరించుకుని మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సకల సౌభాగ్యాలనిచ్చే తల్లికి ప్రీతికరమైన శుక్రవారాన్ని పురస్కరించుకుని ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామస్తులతోపాటు పరిసర గ్రామాల ప్రజలు సైతం ఉదయాన్నే అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

పాలకొల్లు సెంట్రల్: గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వెలుగుచూసింది. శుక్రవారం రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం పాలకొల్లు మండలం భగ్గేశ్వరం గ్రామం శివాలయం వీధికి చెందిన సోమన బాబ్జి (27) అనే యువకుడు గత కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించినా నొప్పి తగ్గకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. బల్లిపాడు ప్రాంతం రైల్వే ట్రాక్ వద్ద ట్రాక్ మరమ్మతులకు ఉపయోగించే టవర్ కార్ వస్తుండగా పట్టాలపై అడ్డంగా పడుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు చేనేత కార్మికుడిగా జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. నరసాపురం రైల్వే అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. పంచనామా నిమిత్తం మృతదేహాన్ని భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు భీమవరం రైల్వే ఎస్సై టీటీవీ రమణ తెలిపారు.

మేరుగను విమర్శించే స్థాయి శ్రవణ్‌కు లేదు

పెనుగొండ: సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునను విమర్శించే స్థాయి జై భీమ్ పార్టీ అధ్యక్షుడు జడ శ్రవణ్‌కుమార్‌కు లేదని ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ ఎద్దేవా చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కొవ్వూరులో జరిగిన దళిత యువకుడు ఆత్మహత్యకు వెంటనే స్పందించి ప్రభుత్వ సాయంగా రూ.10 లక్షలు మంత్రి మేరుగ నాగార్జున అందించాన్నారు. ఆత్మహత్యను శ్రవణ్‌కుమార్ భూతద్దంతో చూపిస్తూ మంత్రి మేరుగపై అవాకులు, చాకులు పేలితే చూస్తూ ఊరోకోమని హెచ్చరించారు. శ్రవణ్‌కుమార్ టీడీపీ తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అంబేడ్కర్ పేరుతో పార్టీ పెట్టుకొని దళిత సమస్యలపై పోరాటం చేయడం మానేసి టీడీపీకి బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

అయ్యప్ప మాలధారుల ఆందోళన

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్‌లో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం వద్ద శుక్రవారం మధ్యాహ్నం మాలధారులు ఆందోళనకు దిగారు. ఆలయం పక్కన ఉన్న మునిసిపల్ స్థలంలో ఓ వ్యక్తి బడ్డీ కొట్టు నిర్వహిస్తున్నాడు. అయితే శనివారం పడిపూజ కోసమని మాలధారులు ఏర్పాట్లు చేస్తుండగా బడ్డీ కొట్టు నిర్వాహకుడితో వాగ్వివాదం ఏర్పడింది. బడ్డీ కొట్టు ఉండడం వల్ల కొంతమంది ఆలయ సమీపంలోనే మద్యపానం చేస్తున్నారని మాలధారులు ఆరోపించారు. అయితే ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు ఇరుపక్షాలను సముదాయించారు. ఈ నేపథ్యంలో ఆలయానికి అడ్డుగా ఉన్న షెడ్డును తొలగిస్తానని నిర్వాహకుడు తెలపడంతో గొడవ సద్దుమణిగింది.

తల్లీబిడ్డల ఆరోగ్యానికి ప్రభుత్వ రక్ష

- వైఎస్సార్ సంపూర్ణ పోషణతో పౌష్టికాహారం అందజేత
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు


ఆచంటలో లబ్ధిదారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

పెనుగొండ: ఆరోగ్య వంతమైన సమాజ నిర్మాణానికి గతంలో తూతూ మంత్రంగా జరిగే పోషకాహార పంపిణీ ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలతో సరైంది. తల్లీబిడ్డల ఆరోగ్య రక్షణ ధ్యేయంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పేరుతో ప్రభుత్వం పౌష్టికాహార కిట్లను అందిస్తుంది. గర్భిణులు, బాలింతలు రక్తహీనత బారిన పడకుండా ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ కిట్లల్లో పోషకాహారం అందిస్తుంది. ఈ కిట్లను ప్రతీ నెలా అంగన్‌వాడీల ద్వారా వీరికి ఇంటికే అందిస్తుంది. సాధారణం గర్భిణులకు, బాలింతలకు రక్తహీనత సమస్యలు ఎక్కువగా వెంటాడతాయి. వారిని, వారికి పుట్టే బిడ్డను ఆదుకోవాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తుంది.

10 రకాల వస్తువులు

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా ప్రభుత్వం టేక్ హోం రేషన్‌లో 10 రకాల వస్తువులను కిట్లల్లో అందిస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో గర్భిణులను, బాలింతలను గుర్తించి నమోదు చేయడం ద్వారా పోషకాహారానఇన అందిస్తున్నారు. పుట్టిన బిడ్డలు ఆరోగ్యంగా ఉండేదుకు, బాలింతల వద్ద సమృద్ధిగా పాలు ఉండేందుకు ప్రభుత్వం అందిస్తున్న కిట్లు ఎంతో దోహద పడుతుంది. అత్యధిక పోషకాలు కలిగిన మూడు కేజీల పోర్టిఫైడ్ బియ్యం, కేజీ కందిపప్పు, అర లీటరు ఆయిల్, 25 గుడ్లు, 5 లీటర్ల పాలు, 2 కేజీల రాగిపిండి, కేజీ అటుకులు, పావు కేజీ చిక్కీలు, పావు కేజీ ఖర్జురం, పావు కేజీ బెల్లం ఈ కిట్స్‌లో ఉంటున్నాయి. అంగన్‌వాడీలో కూడా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను వారికి ప్రతీ నెలా అందిస్తూ వారి మన్ననలు పొందుతున్నారు. ఆచంట నియోజకవర్గంలో పెనుగొండ మండలంలో 725 మందికి, ఆచంట మండలంలో 522 మందికి, పెనుమంట్ర మండలంలో 748 మందికి, పోడూరు మండలంలో 614 మందికి కిట్లను పంపిణీ చేస్తున్నారు.

పోషకాహారాన్ని అందిస్తున్నారు



వైఎస్సార్ సంపూర్ణ పోషక్ టేక్ హోం ద్వారా అంగన్‌వాడీ సిబ్బంది పోషకాహారాన్ని అందిస్తున్నారు. దీంతో తల్లీబిడ్డల ఆరోగ్య రక్షణకు అండగా ప్రభుత్వం నిలుస్తుంది.

– సిర్రా అల్లైఖ్య, పెనుగొండ

ఎంతో ఉపయోగం



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు ద్వారా అందిస్తున్న పోషకాహారం ఎంతగానో ఉపయోగ పడుతుంది. అంగన్‌వాడీ సిబ్బంది ఇళ్లకు తెచ్చి అందిస్తున్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి ఈ కిట్లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

– పూతినీడి సునీత, దొంగగూడెం

యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక


పెనుగొండలో యూటీఎఫ్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: యూటీఎఫ్ పెనుగొండ మండల శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగాఎన్నుకొన్నట్లు నూతన అధ్యక్షుడు ఎస్ సురేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పెనుగొండలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీ మూర్తి, జిల్లా అధ్యక్షుడు పి విజయరామరాజు పాల్గొనగా, ఎన్నికల అధికారిగా కె.రామకృష్ణంరాజు, పరిశీలకులుగా జిల్లా కార్యదర్శి ఎం శ్రీనిబాబులు వ్యవహరించారని తెలిపారు. నూతన కమిటీలో గౌరవ అధ్యక్షుడిగా ఎన్‌వీఎస్‌ఎస్‌కే రామలింగేశ్వరరావు, అధ్యక్షుడిగా ఎస్ సురేష్, ప్రధాన కార్యదర్శిగా జీ శ్రీనివాస్, సహ అధ్యక్షుడు ఎస్.పెద్దిరాజు, మహిళా సహ అధ్యక్షురాలిగా జీవీఆర్‌ఎల్ కృష్ణవేణి, కోశాధికారిగా కేవీవీ సత్యనారాయణ తదితరులను ఎన్నుకున్నారు.

గ్రామాల్లో నాగులచవితి సందడి


పాలకొల్లు సెంట్రల్: పుట్టకు పూజలు చేస్తున్న భక్తులు, చిన్నారికి పుట్టు బూరెలు వేస్తున్న దృశ్యం


పెనుమంట్ర: కామారెడ్డి రైస్ మిల్లు ప్రాంతంలోని పుట్టల వద్ద భక్తుల సందడి


పాలకొల్లు అర్బన్: నాగరాజుపేటలో పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: నాగులచవితి పర్వదినం సందర్భంగా శుక్రవారం పుట్టల వద్దకు భక్తులు పోటెత్తారు. పట్టణంలోని పాతబ్యాంక్ కాలనీ, చిత్రావి చెరువుగట్టు, ఎఎస్ఎన్ఎం కళాశాల గ్రౌండ్, వాటర్ వర్క్స్, లజపతిరాయ్‌పేట సీవీఆర్ పార్క్, లయన్స్ ఆసుపత్రి వద్ద పుట్టలకు భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, పాలు, గుడ్లు, చిమ్మిలి ఉండలు, తేగలు, బుర్రగుంజులతో నాగేంద్రుడికి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు చేశారు. చిన్నారులకు పుట్ట భూరెలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పిల్లలు బాణసంచా కాల్చుకున్నారు. అలాగే క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం, యడ్లబజారు సెంటర్ కనక దుర్గమ్మ ఆలయాల్లో నాగేంద్రులకు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి, నాగరాజు పేట సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, సుబ్బారాయుడు సెంటర్ వల్లీదేవసేన సహిత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి భక్తులు అభిషేకాలు, అష్టోత్తర పూజలు నిర్వహించారు.

పాలకొల్లు మండలంలో..

పాలకొల్లు అర్బన్: నాగులచవితి వేడుకలను మండలంలోని అన్ని గ్రామాల్లో భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చిన్నారులతో కలిసి దంపతులు పొలం గట్ల వైపు బారులు తీరారు. ముఖ్యంగా లంకలకోడేరు, శివదేవునిచిక్కాల, తిల్లపూడి, పెదమామిడిపల్లి, దిగమర్రు, సగంచెరువు, ఆగర్తిపాలెం, అరట్లకట్ట గవరపేట గ్రామాల్లో పుట్టలో పాలు పోశారు. అలాగే పాలకొల్లు రూరల్ పంచాయతీ నాగరాజుపేటలోని శ్రీ వల్లీ దేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన పుట్టలో భక్తులు పాలు పోశారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: నాగులచవితి సందర్భంగా మండలంలోని నాగేంద్రస్వామి ఆలయాల్లో, పాముల పుట్టలవద్ద శుక్రవాం భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. ముఖ్యంగా తూర్పుతాళ్లు, లక్ష్మణేశ్వరం, వేములదీవి కొప్పర్రు, ఎల్‌బీ చర్ల, గొంది, చిట్టవరం, లిఖితపూడి, వైఎస్ పాలెం, సారవ తదితర గ్రామాల్లో భక్తులు ఘనంగా నాగులచవితిని జరుపుకున్నారు. కొప్పర్రు, లిఖితపూడి గ్రామాల్లోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల వద్ద నాగులచవితి నేపథ్యంలో నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేకువజాము నుంచే భక్తులు రాకతో ఆలయాలు కిటకిటలాడాయి.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: మండలంలోని నాగులచవితి సందర్భంగా శుక్రవారం పుట్టల వద్దకు భక్తులకు పోటెత్తారు. మహిళలు పసుపు, కుంకుమలతో నాగ దేవతలకు పూజలు చేసి, అనంతరం పుట్టలవద్ద బాణసంచా కాల్చి నాగుల చవితి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పొలమూరు, మాముడూరు, పెనుమంట్ర, మార్టేరు, ఆలమూరు, జుత్తిగ ప్రాంతాలలో పొలాల్లో ఉన్న పాముల పుట్టల వద్ద మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

తూర్పుతాళ్లులో మహాయజ్ఞం ప్రారంభం


తూర్పుతాళ్లులో శ్రీచండీ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మండలంలోని తూర్పుతాళ్లు గ్రామంలో శుక్రవారం శ్రీ చండీ హోమం కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని దొరయ్య ఇంటి ఆవరణలో జరిగే ఈ కార్యక్రమంలో ఆగమ పండితులు అరవల్లి జగన్నాథ చార్యులు నేతృత్వంలో గణపతిహోమం, రుద్రాభిషేకం, గణపతిహోమం, సామూహిక కుంకుమ పూజలను ఘనంగా నిర్వహించారు. అనంతరం తిరుప్పావై పారాయణం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో అరవెల్లి రాజబాబు పెమ్మరాజు సూర్య వెంకట సుబ్బారావు దంపతులు, రామవరపు వెంకట రమణమూర్తి, కంచర్ల సోనీ, పువ్వాడ లక్ష్మీనరసింహసేతు, పువ్వాడ మారియ్య దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 20 సోమవారం శ్రీనివాస కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు తెలగ కల్యాణమండపం ప్రారంభం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాపు సంఘం నాయకులు

నరసాపురం: రూ 1.50 కోట్లు వ్యయంతో ఆధునీకరించిన నరసాపురం తెలగ కాపు కల్యాణ మండపాన్ని శనివారం ఉదయం ప్రారంభిస్తున్నట్లు కాపు సంఘం నాయకులు కొవ్వలి యతిరాజ రామ్మోహన్‌నాయుడు, చినిమిల్లి సత్యనారాయణ, చాగంటి సత్యనారాయణ, పప్పుల రామారావు, కోటిపల్లి దొరయ్య, కోటిపల్లి వెంకటేశ్వరరావు చెప్పారు. శుక్రవారం సాయంత్రం కల్యాణ మండపం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న కాపు కల్యాణ మండపం ఆధునికీకరణకు ఎన్ఆర్ఐ కొవ్వలి యతిరాజరామ్మోహన్‌నాయుడు రూ.1.50 కోట్లు పూర్తిగా విరాళంగా ఇచ్చారు. శనివారం ఉదయం 4 గంటలకు పూజా కార్యక్రమాలు నిర్వహించి, కొవ్వలి నాయుడు కల్యాణమండపాన్ని ప్రారంభిస్తారు. తన తల్లితండ్రులకు గుర్తుగా ఈ కార్యక్రమం చేపట్టినట్టు నాయుడు చెప్పారు. అలాగే ఆదివారం నియోజకవర్గ కాపు వనసమారాధాన పూర్తిగా నాయుడు ఆర్థిక సహకారంతో ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు.

ధర్మపరిరక్షణకు స్వరూపానంద బోధనలు దోహదం


నత్తారామేశ్వరంలో వస్త్రదానం చేస్తున్న ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, కర్రి రామలింగేశ్వరరెడ్డి

పెనుమంట్ర: హిందూ ధర్మపరిరక్షణ కోసం సద్గురు స్వరూపానందస్వామి బోధనలు ఎంతగానో దోహదపడుతున్నాయని పెనుమంట్ర ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం విశాఖ పీఠాధిపతి స్వరూపానందస్వామి జన్మదిన వేడుకలను పురస్కరించుకని నత్తారామేశ్వరం గ్రామంలో శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కర్రి రామలింగేశ్వరరెడ్డి దంపతల ఆధ్వర్యంలో స్వరూపానంద స్వామి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేద వృద్ధులకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెనుగొండ ఏఎంసీ చైర్‌పర్సన్ వెలగల వెంకటరమణ, గరువు సర్పంచ్ ముదునూరి నాగరాజు, ఏఎంసీ డైరెక్టర్ కర్రి రామారెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొవ్వూరి చిన్నారెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు కర్రి హిమబిందు, ఉపసర్పంచ్ మల్లిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి ప్రభాకరరెడ్డి, కర్రి రామకృష్ణారెడ్డి, కొవ్వూరి శ్రీరామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: స్వరూపానంద స్వామిజీ జన్మదిన ఉత్సవాలు ఆచంట రామేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వృద్ధులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆచంట సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ అడ్డాల పెద్దిరాజు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పెచ్చెట్టి సత్యనారాయణ, దేవస్థానం ఛైర్మన్‌లు కుక్కల కిరణ్, వేమన అప్పారావు, ముదిరాజు విద్యాసాగర్ పాల్గొన్నారు.

రేపు గౌడ, శెట్టిబలిజ కార్తీక వనసమారాధన


విలేకరులతో మాట్లాడుతున్న గౌడ, శెట్టిబజలి సంఘ నాయకులు

పాలకొల్లు అర్బన్: మండలంలోని పూలపల్లి మలుపు వద్ద ఉన్న గౌడ, శెట్టిబలిజ కమ్యూనిటీ హాలు ఆవరణలో ఈ నెల 19న గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, శ్రీశయన, యాత సంఘీయుల పాలకొల్లు నియోజకవర్గ స్థాయి కార్తీక వన సమారాధన ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆ సంఘ నాయకులు వెల్లడించారు. సంఘ కార్యాలయ భవనంలో శుక్రవారం సంఘ గౌరవాధ్యక్షులు మేకా కోటేశ్వరరావు, పితాని వెంకట్ విలేకరులతో మాట్లాడుతూ అసంపూర్తిగా నిలిచిపోయిన కమ్యూనిటీ హాలు పనులను త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నరాఉ. పాలకొల్లు మండలం పూలపల్లి మలుపు వద్ద గల ఈ సందర్భంగా కార్తీక వన సమారాధన ఆహ్వాన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. విలేకరుల సమావేశంలో పాలకొల్లు, యలమంచిలి మండల గౌడ, శెట్టిబలిజ సంఘ అధ్యక్షులు చింతపల్లి సాయిబాబా, గుబ్బల వేణుగోపాల స్వామి, చిట్టూరి ఏడుకొండలు, వేంద్ర సింహాచలం, చినిమిల్లి గణపతిరావు, జోగి వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రంథాలయ వారోత్సవాలు


జిన్నూరు గ్రంథాలయంలో వారోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

పోడూరు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని రిటైర్డ్ ఉపాధ్యాయుడు యర్రమిల్లి శ్రీరామచంద్రమూర్తి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిన్నూరులోని శ్రీ సీతారామరాజు విజ్ఞాన ప్రభ శాఖా గ్రంథాలయంలో శుక్రవారం దేశభక్తి గీతాల పోటీలు, పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్ కూడా కొన్ని గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంటున్నాయన్నారు. ముందుగా మహాత్మాగాంధీ, నెహ్రూ, గ్రంథాలయ ఉద్యమ పితామహులు అయ్యంకి వెంకటరామయ్య, ఎస్ ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు శ్రీరామచంద్రమూర్తి, పలువురు ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ దండు కృష్ణంరాజు, కార్యదర్శి తాళాబత్తుల వెంకటేశ్వరరావు, గ్రంథపాలకురాలు బత్తుల జోగారత్నం, ఉపాధ్యాయులు కాటం శిరీష, సీహెచ్.అన్నపూర్ణేశ్వరరావు, వాసంశెట్టి శ్రీనివాస్, నాగేశ్వరి పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాం, ఉద్యోగుల గ్రీవెన్స్‌కు వినతుల వెల్లువ


వీరవాసరంలో ఉద్యోగుల గ్రీవెన్స్‌లో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

వీరవాసరం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం, ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమాలకు వినతులు వెల్లువెత్తాయి. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 72, ఉద్యోగుల గ్రీవెన్స్‌కు ఏడు అర్జీలు వచ్చాయి. కలెక్టర్ పి.ప్రశాంతి, జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి అర్జీలు స్వీకరించారు. అర్జీల్లో కొన్ని ఇలా..

- వీరవాసరం గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ నిర్వహణలో లోపాలున్నాయని, విచారణ చేసి పూర్తిస్థాయిలో పనులు చేయించాలని ఆ గ్రామ వాసి వర్దినీడి వెంకటలక్ష్మి కోరారు.
- పెర్కిపాలెం గ్రామంలో ప్రధానమంత్రి గ్రామీణ యోజన పథకంలో మంజూరైన రహదారి అసంపూర్తిగా వదిలేశారని, ఈ నిర్మాణాన్ని పూర్తిచేయాలని ఆ గ్రామ వాసి కందులు సతీష్ ఫిర్యాదు చేశారు.
- నరసాపురం వశిష్ట గోదావరి వలందర రేవు కనీస సౌకర్యాలు లేవని, కర్మ కాండల నిర్వహణకు ఇబ్బందులు పడుతున్నారని, కనీస సౌకర్యాలు కల్పించాలని వీరవాసరం నివాసి కాకి లక్ష్మీ రాజేష్ కోరారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నరసాపురం డివిజన్
9010223729 (ఆచంట)
9010201609 (నరసాపురం)
9505507552 (పాలకొల్లు)

Office mail : tpgadvt@gmail.com

